

ఆక్వా సాగుకు లైసెన్సు తప్పనిసరి

అరసవల్లి, జనవరి 11: ఆక్వా సాగుకు లైసెన్సు తప్పనిసరి అని కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ (చెన్నై) డైరెక్టర్ పి.శంకరరావు అన్నారు. ఆక్వా కల్చర్‌లో యాజమాన్య పద్ధతులు, విభిన్న జాతుల పెంపకం అనే అంశంపై గురువారం స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో మత్స్యశాఖ, కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ, ఎంపీఈడీఏ (విశాఖ) ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. రొయ్య ఉత్పత్తులకు మంచి ధర, డిమాండ్ కోసం కేవలం విదేశీ మార్కెట్‌పైనే ఆధారపడకుండా దేశీయ వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఉప సంచాలకులు పీవీ శ్రీనివాసరావు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

- ఒకరేమో శ్రీకాకుళం ఎంపీ సీటు ఆశించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. నియోజవర్గ మంతా కలియ తిరిగారు. సీఎంను కూడా పలుమార్లు కలిశారు. ఇక తనకే టికెట్ అని భావించారు.
- ఇంకొరేమో టెక్కలి ఇన్‌చార్జిగా నియమించబడ్డారు. అధినాయకత్వం కూడా ఆమెకే టికెట్ దాదాపు ఖరారు చేసింది. అప్పటి నుంచి ఆమె ప్రజలతో మమేకమయ్యారు. టికెట్ తనకే అనుకున్నారు.
- వైసీపీ అధినాయకత్వం గురువారం మూడో జాబితా విడుదల చేసింది. ఇందులో వారిద్దరి పేర్లు లేవు. దీంతో ఇద్దరూ కంగుతిన్నారు. ఈసారి ఎన్నికల్లో పోటీ చేయాలన్న వారి ఆశలు అడియాశలయ్యాయి. ఈ మార్పు వ్యవహారం పార్టీలోఓ అంతర్గత పోరుకు దారితీస్తుందన్న ఆందోళన అధికారపార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.

ఆ ఇద్దరికి భంగపాటు

- మూడో జాబితాలో మారిన సీను
- శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థిగా పేరాడ
- దువ్వాడ శ్రీనుకు టెక్కలి టికెట్ ఖరారు
- ఆయన సతీమణి వాణికి మొండిచేయి
- కృపారాణికి ఎంపీ సీటూ లేదాయె..
- జడ్పీ చైర్‌పర్సన్‌గా ఉప్పాడ

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైసీపీ అభ్యర్థులను మార్పు చేస్తూ వస్తోంది. తాజాగా గురువారం రాత్రి మూడో జాబితాను విడుదల చేసింది. అయితే ఈ దఫా ఊహించని విధంగా ఆశించినవారికి భంగపాటే ఎదురైంది. నిరాశే మిగిలింది. గతేడాది ఏప్రిల్ 19న టెక్కలి నియోజకవర్గంలో మూలపేట పోర్టు శంకుస్థాపనకు విచ్చేసిన సీఎం జగన్మోహనరెడ్డి.. సభలో మాట్లాడుతూ టెక్కలిలో కన్ఫ్యూజన్ ఉండకూడదని.. ఎమ్మెల్యే అభ్యర్థిగా దువ్వాడ శ్రీనునే ఖరారు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ వారంలోనే దువ్వాడ శ్రీను సతీమణి నేరుగా సీఎం వద్దకు వెళ్లి.. టెక్కలి అసెంబ్లీ సీటు తనకే కేటాయించాలని.. అందుకు సంబంధించిన కొన్ని కారణాలను ప్రస్తావించారు. కొద్దిరోజుల వ్యవధిలోనే టెక్కలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జిగా దువ్వాడ వాణిగా ప్రకటించారు. ఆతర్వాత పార్టీపరంగా కార్యక్రమాలు చేపడుతున్నారు. మరలా ఇప్పుడు అక్కడ అభ్యర్థిని మార్పు చేసి.. టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా దువ్వాడ శ్రీనుకే ఖరారుచేస్తూ ప్రకటన జారీఅయింది. దీంతో మరలా దువ్వాడ వాణికి నిరుత్సాహం తప్పలేదు. ఇదిలా ఉండగా.. ఇటీవల టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీమంత్రి, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో భారీగా టీడీపీలో చేరికలు ఈ నియోజకవర్గంలో జరుగుతున్నాయి కూడాను. అంటే వైసీపీ ఏరీతిన బలహీనపడుతున్నదో అర్థమవుతోంది. ఇక్కడి వైసీపీలో సమన్వయం ఉన్నట్లు కనిపించినప్పటికీ.. వర్గపోరు తీవ్రంగా ఉంది. ఇక్కడ తామంటే తాము.. అని పలువురు టికెట్ ఆశించారు. కానీ భంగపడ్డారు. వర్గపోరు మళ్లీ మొదటికి వచ్చినట్లయింది. ఇందులో ప్రస్తుత ఎంపీ అభ్యర్థి పేరాడ కూడా ఉన్నారు.



కిల్లి కృపారాణి



దువ్వాడ వాణి

ఇచ్ఛాపురం అభ్యర్థి మార్పు..

వైసీపీలో వర్గపోరు అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో ఇచ్ఛాపురం ఒకటి. 2019లో పిరియా సాయిరాజ వైసీపీ తరఫున పోటీచేసి ఓటమిపాలయ్యారు. అతర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో అతని సతీమణి పిరియా విజయ జడ్పీటీసీగా గెలుపొంది.. శ్రీకాకుళం జడ్పీ చైర్‌పర్సన్ పదవిలో కొనసాగుతున్నారు. తాజాగా అధినాయకత్వం పిరియా విజయను ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించింది. ఇప్పుడు జడ్పీ చైర్‌పర్సన్ పదవి ఇచ్ఛాపురం జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మను నియమించనున్నారు. ఈమేరకు పార్టీపరంగా ఆదేశాలు వెల్లడయ్యాయి. ఇచ్ఛాపురంలో సాయిరాజ్‌పై ఉన్న వ్యతిరేకత.. వైసీపీకి లాభం కంటే నష్టం చేకూరే అవకాశముందని సమాచారం. ఇక్కడ జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తికాకున్నా.. ఆదరాబాదరాగా ఇటీవల సీఎంతో ప్రారంభించేశారని.. ఇంకనూ పనులు జరగాల్సి ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల స్టంట్‌తోనే చేపట్టే కార్యక్రమాలు అధికంగా ఉన్నాయని.. ప్రజల కోసం చేపట్టే కార్యక్రమాలు అల్పంగానే ఉన్నాయంటూ విమర్శలు ఉన్నాయి. ఇదిలా ఉండగా.. ఆమదాలవలస, ఎచ్చెర్ల, పాతపట్నం నియోజకవర్గాల విషయంలో ఎలాంటి నిర్ణయం పార్టీ నుంచి వెల్లడికాలేదు.

ఎంపీ అభ్యర్థిగా పేరాడ.. పాపం కృపారాణి..

కళింగ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పేరాడ తిలక్ వ్యవహరిస్తుండగా.. 2019 ఎన్నికల్లో టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసీపీ నుంచి పోటీచేసి అచ్చెన్నా యుడు చేతిలో ఓటమి పాలయ్యారు. అలాగే ఇదే నియోజకవర్గంలో కీలకంగా వ్యవహరిస్తున్న కేంద్ర మాజీమంత్రి కిల్లి కృపారాణి పార్టీలో చురుగ్గా ఉంటున్నారు. పలుమార్లు సీఎంను కలిశారు. శ్రీకాకుళం ఎంపీ స్థానాన్ని ఆశించినవారిలో ఆమె కూడా ఉన్నారు. కానీ అధినాయకత్వం ఆవిడకు రెండేళ్ల క్రితం పార్టీ పగ్గాలనుంచి కూడా తప్పించేసింది. ఇప్పుడు కూడా ఆశించిన ఎంపీ స్థానాన్ని కూడా కేటాయించలేదు. శ్రీకాకుళానికి చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ కూడా ఈ సీటు కోసం ప్రయత్నించారు. కానీ ఊహించని విధంగా పేరాడ తిలక్‌కు లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమిస్తూ పార్టీపరమైన ఉత్తర్వులు జారీఅయ్యా యి. ఇప్పటికే వర్గపోరు బలంగా అధికార పార్టీలో ఉందాయె. సామా జికవర్గం ప్రకారం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించినప్పటికీ.. సమీకరణాలు దెబ్బతింటాయని రాజకీయ విశ్లేషకులు, సొంతపార్టీ నేతలు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. కృపారాణికి ప్రాధాన్యం ఇవ్వకపోవడంపై ఎన్నికల్లో ఆమె వర్గం సహకరిస్తుందో లేదో అన్నది అనుమానమే.



ఎమ్మెల్యే కిరణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వైసీపీ నాయకులు

కిరణ్‌పై తిరుగుబాటు

- ఆయనకు టికెట్ ఇస్తే మూకుమ్మడి రాజీనామాలు చేస్తాం
- సమావేశమైన వైసీపీ నేతలు

లావేరు, జనవరి 11: ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌పై సొంత పార్టీ నేతలు తిరుగుబావుటా ఎగురవేశారు. ఆయనకు టికెట్ ఇస్తే మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని అధిష్ఠానాన్ని హెచ్చరించారు. లావేరు మండలం తాళ్లవలస వద్ద గురువారం కిరణ్ వ్యతిరేక వర్గానికి చెందిన సీనియర్ నాయకులు లుకలాపు అప్పలనాయుడు, జరుగుళ్ల శంకరరావు, పైడి భాస్కరరావు, బూరాడ వెంకటరమణ, అల్లు భాస్కరరావు, సాకేటి నాగరాజు, గొర్లె రామినాయుడు, తేనెల సురేష్, పెరిమల్ల రమణ తదితరులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. '2019 ఎన్నికల్లో కిరణ్‌కుమార్ గెలుపునకు మేము ఎంతో శ్రమించాం. ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత మాలాంటి సీనియర్లను పక్కన పెట్టేశారు. ఆయనకు ఆదాయాన్ని సమకూర్చే కొంతమందిని అక్కున చేర్చుకున్నారు. మమ్మల్ని అవమానాలకు గురిచేస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో రెండేసి గ్రూపులు పెట్టి పార్టీని భ్రష్టుపట్టించారు. ఈసారి ఎన్నికల్లో అయనకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వొద్దు. వేరే ఎవరికి ఇచ్చినా మేమంతా కలిసి పని చేస్తాం.' అని తెలిపారు. ఈ సందర్భంగా కిరణ్ వద్దు.. సీఎం జగన్ ముద్దు అని నినాదాలు చేశారు.

అంగన్‌వాడీలపై ఎస్మాను రద్దు చేయండి

- తక్షణమే జీతాలు పెంచాలి
- అఖిలపక్ష నాయకుల డిమాండ్



నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు ప్రకటిస్తున్న అఖిలపక్ష నాయకులు

అరసవల్లి, జనవరి 11: అంగన్‌వాడీలపై ఎస్మాను రద్దు చేసి వారి జీతాలు వెంటనే పెంచాలని అఖిలపక్ష నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు అధ్యక్షతన నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అంగన్‌వాడీలకు మద్దతుగా గురువారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, జనసేన పార్టీ జిల్లా నాయకుడు పేడాడ రామ్మోహనరావు పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం, పీఎఫ్, గ్రాట్యుటీ ఇవ్వకుండా, కార్మిక చట్టాలు అమలు చేయకుండా ప్రభుత్వం దోపిడీకి పాల్పడుతుందని విమర్శించారు. తక్కువ వేతనాలతో అంగన్‌వాడీలు తమ కుటుంబాలను ఎలా పోషించుకోగలరని ప్రశ్నించారు. వారిని భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. సంక్రాంతి లోగా అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరించకపోతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎస్మాను రద్దు చేసి, అంగన్‌డీల వేతనాలు పెంచాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకుడు సుందరలాల్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కోశాధికారి అల్లు సత్యనారాయణ, ఎం.ఆదినారాయణమూర్తి, ఎం.శంకరనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె..

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెను కొనసాగిస్తున్నారు. కలెక్టరేట్ సమీపంలోని జ్యోతిబాపూలే పార్కువద్ద చేపడుతున్న 24 గంటల రిలే నిరాహార దీక్షలు గురువారం 6వ రోజుకు చేరుకున్నాయి. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్‌జిల్లా అధ్యక్షురాలు కె.కళ్యాణి, కోశాధికారి ఎస్.హైమవతి మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, గౌరవ వేతనం కాకుండా కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీరికి సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఎం.ఆదినారా యణమూర్తి సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవాలని, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేదంటే నిరవధిక నిరాహార దీక్షలు, చలో విజయవాడ చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

సొమ్మసిల్లిన అంగన్‌వాడీ సహాయకురాలు..

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం బస్టాండ్ జంక్షన్ వద్ద గురువారం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెలో పాల్గొన్న బలరాంపురం గ్రామానికి చెందిన సహాయకురాలు లండ మహాలక్ష్మి ఎండ తీవ్రతకు సొమ్మసిల్లి పోయింది. వెంటనే కార్యకర్తలు ఆమెను ఆటోలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం సాయంత్రం ఇంటికి తీసుకెళ్లారు. మహాలక్ష్మి గత 31 రోజులుగా సమ్మెలో పాల్గొంటుందని యూనియన్ సభ్యులు హైమా, సుబ్బలక్ష్మి తెలిపారు. అయితే, సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఆమె తీవ్ర ఒత్తిడికి లోనై అనారోగ్యానికి గురై సొమ్మసిల్లి పోయిందని వాపోయారు. ప్రాణాలు పోతేగానీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించదా అని మండిపడుతున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహాలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లఠ్కర్

22న ఓటర్ల తుది జాబితా

- ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం
- కలెక్టర్ శ్రీకేష్ లఠ్కర్

కలెక్టరేట్, జనవరి 11: ఓటర్ల తుది జాబితాను ఈ నెల 22న విడుదల చేస్తామని కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లఠ్కర్ తెలిపారు. రాజకీయ పార్టీలు అందించే వినతులు, ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటిస్తామన్నారు. తక్కువ సమస్యలు ఉన్నాయని, వాటిని త్వరలోనే పరిగణనలోకి తీసుకుంటామన్నారు. బీఎల్వోల స్థాయిలో దరఖాస్తుల పరిశీలన జరిగిందని, ఏమైనా పొరపాట్లు జరిగితే పూర్తి స్థాయిలో చర్యలు చేపడతామని తెలిపారు. క్యాండిడేట్ హ్యాండ్‌బుక్ ఈసీఐ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు. ఈ నెల 12న (శుక్రవారం) నాటికి అన్ని క్లెయిమ్‌లను పరిష్కరిస్తామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరినట్లుగానే డబుల్ ఎంట్రీ, పోలింగ్ బూత్‌లు తదితర అంశాలపై నివేదిక అంజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, పీఎంజే బాబు (టీడీపీ), రౌతు శంకరరావు (వైసీపీ), ఎల్.సోమేశ్వరరావు (బీఎస్పీ), వి.సురేష్‌బాబు సింగ్ (బీజేపీ), సి-సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ గాయకుడు ఏపూరు సోమన్న గీతాలాపన



విద్యార్థినుల థింసా నృత్యం

సంస్కృతి, సంప్రదాయాలకు ఆలవాలం జానపదం

- తెలంగాణ ప్రజాగాయకుడు ఏపూరి సోమన్న
- ఘనంగా సిక్కోలు జానపద కళాజాతర

పలాస రూరల్, జనవరి 11: 'సంస్కృతి, సంప్రదాయాలకు ఆలవాలం జానపదం. మన అలవాట్లు, అభిరుచులు జానపద గీతాల్లో వినిపిస్తా'యని తెలంగాణకు చెందిన కళాకారుడు, బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్న అన్నారు. మండలంలోని గురుదాసుపురంలో సిక్కోలు జానపద కళాజాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సోమన్న మాట్లాడుతూ.. జానపదాలు ప్రస్తుత కాలంలో రూపాంతరం చెందినా వాటి ఉనికి మాత్రం మారలేదన్నారు. ఉద్దానం పోరు గడ్డ అని, నాటి సాయుధ పోరాటంలో పలికిన పలుకులను నేడు పలుకుతుంటే శరీరం ఉప్పొంగుతుందన్నారు. ఇటువంటి వేడుకలు కచ్చితంగా నిర్వహించి జానపద కళలకు జీవం పోయాలన్నారు. అనంతరం ఆయనతో పాటు ప్రజాగాయకుడు రాంబాబు జానపద గీతాలను ఆలపించారు. మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ.. ఉద్దానంలో జానపద గీతాలు, ఆటాపాటల కోసం వేదిక నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మాట్లాడుతూ.. ప్రతి ఏటా సంక్రాంతికి ముందు జానపద గీతాలు, ఆటాపాటలతో ఇటువంటి బృహత్తర కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. అనంతరం సారంగపురం గంగిరెద్దుల ఆటలు, పీత గంగయ్య తప్పెటగుళ్లు, చెక్కభజన, అసిరయ్య, గువ్వాడ మల్లేసుల బోనెల పాట, మాకన్నపల్లి, చిననీలావతి జట్ల కోలాటం, చినబహడాపల్లి అమ్మవారి ఆట, పట్టులోగానికి చెందిన గిరిజన విద్యార్థినుల థింసా నృత్యాలతో పాటు శాస్త్రీయ, అంజాట, కాళికావేషధారణ, అత్తాకోడలు గేయం, బుడగ జంగాల గీతాలు అలరించాయి. సిక్కోలు కళాజాతర నిర్వాహకులు కుత్తుమ లక్ష్మణరావు, రాపాక ధనరాజు, కుత్తుమ వినోద్, డాక్టర్ కుమార్‌నాయక్, బత్తిన శాంతారావు, ఎం.నారాయణ, ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, సర్పంచ్ కుత్తుమ రూపవతి, ఎం.దేవరాజు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర పోటీల్లో డిష్యూం.. డిష్యూం..

- సత్యవరం, కరగాం క్రీడాకారుల మధ్య ఘర్షణ

నరసన్నపేట, జనవరి 11: మండల కేంద్రం నరసన్నపేట డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర పోటీల్లో క్రీడాకారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ పోటీల్లో భాగంగా సత్యవరం రూరల్, కరగాం సచివాలయాల క్రీడాకారుల మధ్య కబడ్డీ జరిగింది. సత్యవరం రూరల్ క్రీడాకారుడు కూతకు వెళ్లాడు. అయితే, పాయింట్లు తీసుకువచ్చిన విషయంపై ఇరుజట్ల క్రీడాకారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మాటమాట పెరిగి కోర్టులోనే తోపులాటకు దిగారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సింహాచలం ఆధ్వర్యంలో పోలీసులు క్రీడా మైదానానికి చేరుకుని క్రీడాకారులకు సర్ది చెప్పారు. చెరో జట్టుకు ఐదు కూతలు ఇచ్చి దగ్గర ఉండి పోటీలను నిర్వహించారు. దీంతో వివాదం సద్దుమనిగింది.



ఘర్షణ పడుతున్న కబడ్డీ క్రీడాకారులు

విరిగిన బాలిక కాలు..

జి.సిగడాం: ఆడుదాం ఆంధ్ర పోటీల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. పాలఖండ్యాంలో గురువారం నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్న జి.సిగడానికి చెందిన నడుపూరు సుకన్య అనే విద్యార్థిని కుడి కాలు విరిగిపోయింది. వెంటనే ఆమెను రాజాంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి కాలుకు శస్త్ర చికిత్స చేయాలని చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సుకన్య జి.సిగడాం జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతుంది.



ఆసుపత్రిలో చేరిన సుకన్య

కలర్‌ఫుల్ : రంగులమయమైన నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని టెన్నిస్ కోర్టు



హరివిల్లు.. సిరిజల్లు..

వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ

గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

ద్వితీయ బహుమతి విజేతలు

ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.

- ఏ.సునీత, గుంటూరు జిల్లా

పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

- రాధ, తమిళనాడు

కెనరా బ్యాంక్
केनरा बैंक
Canara Bank
A Government of India Undertaking
Together We Can
ఆంధ్రజ్యోతి
ABN
AIMS INSTITUTES
Peenya, Bangalore
+91 81500 01994
SWARGASEEMA SUKETANA
Ph: + 91 98490 12500



విజేతలు వీరే..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆదిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), సీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)

పలాసలో జాతీయ టెన్నీకాయిట్ పోటీలు

పలాస: పలాస ప్రభుత్వోన్నత పాఠశాల మైదానంలో 47వ జాతీయ టెన్నీకాయిట్ పోటీలు సందడిగా జరుగుతున్నాయి. గురువారం వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళ, పురుషుల జట్లు లీగ్ పోటీల్లో హోరాహోరీగా తలపడ్డాయి. శుక్రవారం నుంచి సెమీఫైనల్స్ నిర్వహించనున్నారు. తమిళనాడు- ఒడిశా, కేరళ-తెలంగాణ, పాండిచ్చేరి-మహారాష్ట్ర, కర్నాటక- ఆంధ్రప్రదేశ్, తమిళనాడు-పశ్చిమబెంగాళ్, మహారాష్ట్ర- తెలంగాణ, కేరళ-ఆంధ్రప్రదేశ్, పాండిచ్చేరి-కర్నాటక జట్లు లీగ్‌పోటీల్లో తలపడ్డాయి.

నారాయణవలస సంతకు సంక్రాంతి కళ



క్రయవిక్రయదారులతో కిటకిటలాడుతున్న నారాయణవలస సంత

జలుమూరు: నారాయణవలస గురువారం వారపు సంతలో సంక్రాంతి కళ కనిపించింది. సంక్రాంతికి ముందు వారం కావడంతో పొట్టేళ్లు, మేకపోతులు విక్రయానికి భారీగా తరలివచ్చాయి. క్రయ, విక్రయదారులతో కిటకిటలాడింది. పొట్టేళ్లకు గిరాకీ ఏర్పడింది.10 కేజీలు పొట్టేళ్లు 12 వేలు ధర పలికింది.అలాగే నాటుకోళ్లు కూడా కొనుగోలుకు పలువురు ఎగబడ్డారు.

సెలవు రోజు తరగతులు సరికాదు

● టెక్కలిలో ఓ పాఠశాల యాజమాన్యంపై ఎంఈవోల ఆగ్రహం



తరగతి గదికి తాళం వేసి ఉండడాన్ని పరిశీలిస్తున్న ఎంఈవోలు

టెక్కలి: ప్రభుత్వం అన్ని పాఠశాలలకు సంక్రాంతి పురస్కరించుకుని సెలవులు మంజూరు చేస్తే, తలుపులు వేసి తరగతులు నిర్వహిస్తుండడం సరికాదని టెక్కలిమండల విద్యాశాఖాధికారులు తులసీరావు, చిన్నారావు ఓ పాఠశాల యాజమాన్యానికి స్పష్టం చేశారు. గురువారం టెక్కలిలో ఓ ప్రైవేట్ పాఠశాలలో తరగతులు నిర్వహిస్తోందని ఏబీవీపీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంఈవోలు తనిఖీచేశారు. ఓ గదికి తాళం వేసి కిటికీలు మూసి ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు చెప్పడాన్ని ఎంఈవోలు గుర్తించి తాళం తెరిపించారు. కిటికీలు మూసి చీకటిగదిలో పాఠాలు చెప్పడంపై సంబంధిత డైరెక్టర్, ఉపాధ్యాయులపై ఆగ్రహంవ్యక్తం చేశారు. మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదని ఎంఈవోలు పాఠశాల యాజమాన్య ప్రతినిధులపై మండిపడ్డారు. సెలవు నిబంధనలు పాటించరా అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంకోసారి ఈ పరిస్థితి జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంఈవోలతో పాటు ఏబీవీపీ నాయకులు మురళి, మదన్, అరవింద్, శ్యామ్ తదితరులు ఉన్నారు.

పేదలకు యువత సేవచేయాలి

● పాతపట్నం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకట రమణమూర్తి



మాట్లాడుతున్న వెంకటరమణమూర్తి

మెళియాపుట్టి:యువత పేదలకుసేవ చేయడంలో ముందుండాలని పాతపట్నం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కలమట వెంకటరమణ మూర్తి తెలిపారు. గురువారం కొసమాళలో అంకడాల లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్టు ప్రారంభోత్సవంలో మాట్లాడారు. టీడీపీసేవా కార్యక్రమాల్లో ఎప్పుడు ముందుంటుందన్నారు. విపత్తులు వంటి పరిస్థితులు వచ్చినప్పుడు యువత ముందుండి ఆదుకోవాలన్నారు. అనంతరం పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేశారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు యు.వసంత్ సిరిపురం వెంకట్రావ్,మధు, సుబ్బరావు, శ్రీధర్, బోచ్చు ప్రసాదరావు, లోకనాథం, శంకర్,జనసేన నాయకులు డి.బాలరాజ్ పాల్గొన్నారు.

ఇంటర్ సిటీకి హాల్ట్ ఇవ్వాలి

సంతబొమ్మాళి: కోటబొమ్మాళి రైల్వేస్టేషన్‌లో ట్రైన్ నెంబరు 18525 బ్రహ్మపూర్-విశాఖ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ ఇవ్వాలని బోరుభద్రకు చెందిన సామాజిక కార్యకర్త గొనప అప్పన్న కోరారు. ఈ మేరకు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాశారు.

బాల్య వివాహాలపై అవగాహన

సంతబొమ్మాళి:సంతబొమ్మాళిలోని మండల మహిళ సమాఖ్యలో మహిళ సంఘ సభ్యులకు బాల్య వివాహల నిర్మూలన కోసం జీవోఎంఎస్-31పై గురువారం అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఎవరైనా బాల్య వివాహాలు గ్రామాల్లో చేస్తుంటే 1098,100,112,181 నంబర్లకు సమాచారం ఇవ్వాలని జిల్లా బాలల రక్షణ విభాగం కౌన్సిలర్ ధర్మాన సీతారాములు కోరారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సూర్యనారాయణ, మహిళ సంఘ అధ్యక్షురాలు రమణమ్మ, చైల్డ్ లైన్ సూపర్‌వైజర్ వైకుంఠరావు పాల్గొన్నారు.

పోటీతత్వంతోనే విజ్ఞానాభివృద్ధి

ఎల్.ఎన్.పేట: పాఠశాలదశ నుంచి విద్యార్థులుపోటీతత్వం పెంపొందించుకోవడం వల్ల విజ్ఞానం అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు.గురువారం లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సత్యసాయి సంస్థలు వ్యాసరచన పోటీలను నిర్వహించాయి. సత్యసాయి భజనమండలి మండల కన్వీనర్ ఎ. నారాయణరావు మాట్లాడుతూ ఎ.స్వాతి, వి.అశ్విని, ఎం.దర్శినిలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సాధించారని చెప్పారు. కార్యక్రమంలో యూత్ కోఆర్డినేటర్ కె.అప్పలనాయుడు పాల్గొన్నారు.

'రాజకీయాలకతీతంగా పథకాలు'

జలుమూరు: రాజకీయాలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాసు తెలిపారు. కరకవలసకాలనీలో గురువానం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శ్రీముఖలింగంలో హెల్త్‌క్లీనిక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పోలాకి:ఉపాధ్యాయులు పాలనా పరంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరింపచేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర సహాయ అధ్యక్షుడు చింతాడ దిలీప్‌కుమార్ కోరారు. గురువారం పిన్నింటిపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అప్పటి సీఎం చంద్రబాబునాయుడు ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమీక్షించి నిర్ణయాలు తీసుకునేవారని, ప్రస్తుత సీఎం జగన్ ఏకపక్ష ఏకవాక్య నిర్ణయాలు తీసుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు.

వీఆర్‌ఏల రాష్ట్ర కార్యదర్శిగా గోపి

పోలాకి: గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘ(వీఆర్‌ఏ) రాష్ట్ర కార్యదర్శిగా మబగాం వీఆర్‌ఏ కె.గోపి ఎన్నికయ్యారని వీఆర్వోల సంఘం నాయకులు ప్రగడవేణు, బోర జగన్నాథం తెలిపారు. గురువారం తహశీల్దార్ కంచరాన శ్రీరాములు గోపిని సత్కరించారు. కార్యక్రమంలో డీటీ పొదిలాపు శ్రీనివాసరావు, ఆర్ఐ సతీష్ పాల్గొన్నారు.

23.70 కిలోల గంజాయి స్వాధీనం

జలుమూరు: గంజాయి అక్రమంగా రవాణాచేస్తున్న, విక్రయిస్తున్న ముగ్గురు నుంచి 23.70 కిలోలు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఈబీ ఎస్ఐ డి.ప్రభాకర్ తెలిపారు. లింగాలవలస గ్రామానికి చెందిన మొజ్జాడ సరస్వతి, హరికృష్ణమ్మపేటకు చెందిన సరస్వతి మరిది బి.ప్రకాష్ ఇళ్లను సోదాలు చేసి 21.20 కిలోలు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే ఒడిశాలోని బొమ్మిక గ్రామానికి చెందిన బృందావతి రౌలు అక్రమంగా గంజాయిని తరలిస్తుండగా పాతపట్నం వద్ద 2.50 కిలోలు గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆలయంలో చోరీపై సమగ్ర దర్యాప్తు

పోలాకి: పోలాకి మానవ వనరుల కేంద్ర సమీపంలోని మల్లేశ్వరాలయంలో గత రాత్రిచోరీ జరిగిందని అర్చకులు గురువారం ఫిర్యాదు మేరకు సమగ్ర దర్యాప్తుచేస్తున్నామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. సంక్రాంతి పురస్కరించుకుని ప్రజలు దొంగలపై అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

భూ రీసర్వే వేగవంతం చేయండి: సబ్‌కలెక్టర్



భూరీసర్వే గురించి వివరిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్

పాతపట్నం: భూరీసర్వేను వేగవంతం చేయాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ కోరారు. గురువారం ఆర్ఎల్‌పురంలో రైతులతో భూరీసర్వేపై నిర్వహించిన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమగ్ర భూరీసర్వేతో దీర్ఘకాలిక భూసమస్యలకు శాశ్వతప్రాతిపదికన పరిష్కారం లభిస్తుందని తెలిపారు.రైతులు భూములవివరాలు పేర్లను రికార్డుల్లో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.రవిచంద్ర, డీటీ డి.ప్రసాదరావుతోపాటు వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నవోదయ మోడల్ పరీక్ష

మందస: హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నవోదయ మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ మండలఅధ్యక్షప్రధాన కార్యదర్శులు జగదీష్ బడిత్య, దాసరి ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పలాస, మందస, వజ్రపుకొత్తూరు, మండలాల్లో నవోదయ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఈ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.







ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, శ్రీకాకుళం : 9985411535
రాజాం : 9494691912, పలాస : 9985411532

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి

దుర్గాదేవి జ్యోతిష్యపీఠం
» దుర్గాదేవి జ్యోతిష్య పీఠం: యస్.వి. రాఘవేంద్రజోషి, పునర్వివాహం, దాంపత్య సమస్యలు, అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు, స్త్రీ ప్రేమ, వశీకరణం, ప్రతి సమస్యకు అంజనం, హోమాలతో 2 రోజుల్లో శాశ్వత పరిష్కారం. చూపగలము. సెల్ : 6364 999 444
AJB-606

ఆంధ్రజ్యోతి
అచిరకాలంలో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లలో ఏ నెంబరు కైనా ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.
ఫోన్ నెంబర్లు
ACM : 99854 11514
ACO-1 : 99854 00079
ACO-2 : 99854 11535
Office : 08942 - 281995

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

క్లాసిఫైడ్స్ సంప్రదించాల్సిన నెంబర్లు:
శ్రీకాకుళం: 9985465497, నరసన్నపేట:9985425891
పలాస: 9985411524, సోంపేట: 9989281099.

ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్ - ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

మద్యం మత్తులో నలుగురు హల్‌చల్

శ్రీకాకుళం క్రైం: నగరంలో నలుగురు వ్యక్తులు మద్యం తాగుతూ కారులో షికారులు కొడుతూ హల్‌చల్ చేస్తుండడంతో ట్రాఫిక్ పోలీసులు వారిని సూర్య మహల్ కూడలిలో పట్టుకున్నారు. ట్రాఫిక్ ఎస్ఐ దొర వారికి డ్రెంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించేందుకు ప్రయత్నించగా, వారంతా ట్రాఫిక్ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆ ప్రాంతంలో కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. కారులో మద్యం తాగుతూ న్యూసెన్స్ చేసిన వారు డ్రెంకెన్ డ్రైవ్ పరీక్షకు సహకరించకపోవడంతో కారును ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

విద్యుదాఘాతంతో లారీ డ్రైవర్‌కు గాయాలు

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ (బాట్లింగ్ యూనిట్) వద్ద గురువారం విద్యుదాఘాతంతో విజయవాడకు చెందిన లారీ డ్రైవర్ పి.రవి గాయపడ్డాడు. లారీ నుంచి మద్యం కేసులు అన్‌లోడ్ చేసే క్రమంలో పై భాగానికి ఎక్కిన డ్రైవర్ ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలు తాకినట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. దీంతో స్పృహ కోల్పోయిన డ్రైవర్ రవిని 108 వాహనంలో శ్రీకాకుళంలోని సర్వజనా సుపత్రికి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖ తరలించారు. ఈమేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ



నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

ఆమదాలవలస: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటలింగ్ జీవో రద్దు చేయాలంటూ న్యాయవాదులు విధులు బహిష్కరించారు. గురువారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వద్ద సీనియర్ న్యాయవాదులు సాధు ధనుంజయరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు గేటు ముందు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు తమ్మినేని అన్నంనాయుడు, గురుగుబిల్లి ప్రభాకరరావు, వాడవలస రాజేశ్వరరావు, బొడిగి రమణ, బి.సీతారాం, బొడ్డేపల్లి మోహన్‌రావు, ఎ.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్‌బీఐ బంగారు ఆభరణాల తాకట్టు కేసులో కొత్త మలుపు

● లాకర్ రూమ్‌లో ఉన్న మరో వ్యక్తి పాత్రపై పోలీసుల ఆరా

శ్రీకాకుళం క్రైం: రాష్ట్రంలోనే సంచలనం రేపిన గార ఎస్‌బీఐ బ్రాంచ్‌లో బంగారు ఆభరణాల తాకట్టు కేసులో మరో వ్యక్తి పాత్రపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నట్టు భోగట్టా. ఈ కేసులో లాకర్ రూమ్‌లోకి వచ్చిన మరో వ్యక్తి (లోకనాథం)ని పోలీసులు విచారించారు. ఇప్పటికే ఈ కేసులో ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెల్సిందే. అయితే ఒకప్పుడు గార బ్రాంచ్‌లో పనిచేసిన లోకనాథంను విచారించిన పోలీసులు అతని నుంచి వాంగ్మూలం తీసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. బ్యాంకులో బంగారం మాయమైన సమయంలో ఆ వ్యక్తి కూడా సీసీ ఫుటేజీలో ఉండడంతో అతడి పాత్రపై పోలీసులు ఆరా తీస్తున్నట్టు తెలుస్తుంది. ఈ కేసులో దోషులను పట్టుకునేందుకు పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నారు. ఇదిలా ఉండగా ఈ కేసు తెచ్చిపెడుతున్న తలనొప్పుల కారణంగా కొందరు ఉద్యోగులు సెలవులు పెట్టి విధులకు దూరంగా ఉంటున్నట్టు బ్యాంకు సిబ్బంది బాహటంగానే చెప్పుకుంటున్నారు. అయితే ఇంతకాలం సీసీ ఫుటేజీలో ఉన్న ఈ వ్యక్తిని పోలీసులు ఇంత వరకు ఎందుకు విచారించలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

అంగన్‌వాడీ కేంద్రాలకు నోటీసులు

సరుబుజ్జిలి: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు గురువారం గ్రామ సచివాలయం ఉద్యోగులు షోకాజ్ నోటీసులు అంటించారు. డిసెంబరు 12వ తేదీ నుంచి మండలంలోని 59 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు తొమ్మిది మినీ కేంద్రాల వర్కర్లు, హెల్పర్లు సమ్మెలో ఉన్నారు. దీంతో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందకపోవడంతో ఇటీవల అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించింది. అయినా వారు సమ్మె విరమించకపోవడంతో షోకాజ్ నోటీసులు ఇవ్వాలంటూ జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో గురువారం అంగన్‌వాడీల విధివిధానాలను వివరిస్తూ ఆయా కేంద్రాల గోడలకు నోటీసులు అంటించారు.

గంజాయి విక్రయాలు అవాస్తవం

శ్రీకాకుళం క్రైం: కొత్తూరు ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు ఓ పాన్ షాప్‌కి చెందిన వ్యక్తి చాక్లెట్‌లో గంజాయి కలిపి ఇస్తున్నట్టు సామాజిక మాధ్యమాల్లో వస్తున్నది అవాస్తవమని ఎస్ఈబీ ఏఎస్పీ వీఎస్ మణికంఠ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది తెలంగాణ రాష్ట్రం శంషాబాద్ పరిధిలో ఉన్న కొత్తూరు ప్రభుత్వ పాఠశాలకు సంబంధించిన వీడియోగా సమాచారం ఉన్నట్టు స్పష్టం చేశారు.

నగరంలో సంక్రాంతి సందడి

అరసవల్లి: నగరంలో సంక్రాంతి సందడి మొదలైంది. వస్త్ర దుకాణాలు కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్నాయి. గతేడాది కంటే ఈ సారి నూతన వస్త్రాల కొనుగోలు రికార్డు స్థాయిలో జరుగుతున్నట్టు పలువురు వ్యాపారులు అంటున్నారు. జీటీ రోడ్డులో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు రావడంతో అన్ని రకాల షాపులు కళకళలాడాయి. అలాగే ప్రయాణికులతో గురువారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ జనసంద్రమైంది. రిజర్వేషన్ కౌంటర్ల వద్ద బారులు తీరారు.


ఆర్టీసీ టికెట్ కౌంటర్ వద్ద ప్రయాణికుల రద్దీ

తాగేందుకు నీళ్లు కూడా లేవు

● 'ఆడుదాం ఆంధ్రా'లో క్రీడాకారుల అవస్థలు

ఇచ్ఛాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా పోటీల్లో క్రీడాకారుల అవస్థలు వర్ణనాతీతం. గురువారం సురంగిరాజా మైదానంలో వివిధ క్రీడాపోటీలు జరిగాయి. క్రీడాకారులు నీరుతాగుతామన్నా ఒక్క చుక్కకూడా అందుబాటులో లేవు. కొంతమంది దాహాన్ని తీర్చుకొనేందుకు సొంత డబ్బులు వెచ్చించి ఐస్‌క్రీమ్స్, వాటర్ బాటిల్స్ తెప్పించుకున్నారు. మధ్యాహ్న భోజనాలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చి క్రీడాకారులు ఆకలితో ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం నిధులు కేటాయించిన నిధులు ఏమైనట్టని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పోటీల వద్ద కనీస మౌలిక వసతులు కల్పించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

సిక్కోలు రచయితలకు పురస్కారాలు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళానికి చెందిన కేశవరాయునిపాలెం ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు పీవీ దుర్గాప్రసాద్‌కు ఏలూరులో వైఎం హైస్కూల్‌లో సాహిత్య అకాడమీ ఛైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, చేతుల మీదుగా పురస్కారం ఇచ్చారు. ఈ-వేమన చాడ శ్రీనివాస్‌కి, బూర్జ కోటేశ్వరరావుకి, కేంద్ర గ్రంథాలయ సెక్రటరీ బుర్రి కుమార్ రాజుకు, జంధ్యాల శరత్‌బాబుకు పురష్కారాలు అందజేశారు.

యువత దృష్టి మరల్చడానికే..

గార: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా యువత దృష్టి మరల్చడానికి ఆడుదాం ఆంధ్రా నిర్వహిస్తోందని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి జల్లు రాజీవ్ అన్నారు. గురువారం గారలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇంతవరకూ గుర్తుకు రాని గ్రామీణ క్రీడాకారులు ఇప్పుడే గుర్తుకు రావడం విడ్డూరంగా ఉందన్నారు. యువతను మభ్యపెట్టేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం శోచనీయమని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

గార: ప్రసిద్ధ శ్రీకూర్మనాథ క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన భమిడిపాటి వెంకట సాయి శివజ్యోతి రూ.25 వేలు రూపాయలు విరాళాన్ని అందించారు. ఈ మేరకు గురువారం ఉదయం ఆలయ ఈవో గురునాథరావుకి అందజేశారు.

బీసీలకు తీరని అన్యాయం

● ఒక్క బీసీ లబ్దిదారునికీ రుణమివ్వని ప్రభుత్వం
● జగన్‌పై తెలుగుదేశం పార్టీ నాయకుల ధ్వజం

రాష్ట్రంలో జగన్ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని తెలుగుదేశం పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. గురువారం పలాసలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు.అలాగే పలు చోట్ల ఆ పార్టీ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ హయాంలో బీసీలకు జరుగుతున్న అన్యాయం, అగౌరవం గురించి వివరించారు.


పలాస: జయహో బీసీ కార్యక్రమంలో ఎన్టీయార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న శిరీష , బీసీ నాయకులు


సోంపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

మంత్రులు ప్రశ్నించరేం: శిరీష

పలాస: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బీసీలకు తీరని అన్యాయం చేశారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆరోపించారు. రాష్ట్రంలో బీసీలే లక్ష్యంగా దాడులు జరుగుతున్నా, వైసీపీ బీసీ మంత్రులుగా పదవులు అనుభవిస్తున్నవారు కనీసం ప్రశ్నించడం లేదన్నారు. గురువారం పలాస టీడీపీ కార్యాలయంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ.. పేరుకు బీసీ కార్పొరేషన్లు పెట్టి ఛైర్మన్లకు కనీసం కుర్చీ కూడా ఇవ్వకుండా అగౌరపరచారన్నారు. రూ.75వేల కోట్ల బీసీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించారని, తమ ప్రభుత్వ హయాంలో బీసీలకు పెద్దపీట వేసిన విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ఆదరణ పేరుతో పరికరాలు ఇచ్చి వారి జీవన ఉన్నతికి తోడ్పడ్డామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలపై ఎస్మా ప్రయోగించి ఉక్కుపాదం మోపడం దుర్మార్గమన్నారు. మునిసిపల్ కార్మికులు, 108 సిబ్బంది ఆందోళనలు జరుగుతున్నా వారికి ఏమి కావాలో ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పలాసలో మంత్రి సీదిరి అప్పలరాజు ఆగడాలు, భూ కబ్జాలు పెరిగి పోయాయని, సొంత అభివృద్ధి తప్పా పలాస అభివృద్ధిపై దృష్టిసారించలేదని విమర్శించారు.ఆఫ్‌షోర్ రిజర్వాయర్, రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి, వంశధార కాలువ ఆధునీకరణ, ఏహెచ్‌సీ, హుద్‌హుద్ గృహాల కేటాయింపు మరిచి తమ నాయకులనే బెదిరించేస్థాయికి ఎదిగారని ఆరోపించారు. టీడీపీరాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు మాట్లాడుతూ బీసీల కోసం మాట్లాడే అర్హత వైసీపీ ప్రభుత్వానికి లేదన్నారు. తొలుత ఎన్టీయార్ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో బీసీ సంఘ నాయకులు లొడగల కామేశ్వరరావుయాదవ్, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, టంకాల రవిశంకర్‌గుప్తా, శాసనపురి మురళీకృష్ణ, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, జోగ మల్లి, డొక్కర శంకర్, దువ్వాడ హేమబాబుచౌదిరి, దువ్వాడ శ్రీహర్ష, జనసేన నాయకుడు సంతోష్‌పండా, పెంట ఉదయ్‌శంకర్, డిక్కల ఆనంద్, టీడీపీ పరిశీలకులు కలమల సాగర్, దర్మాన తేజ్‌కుమార్ పాల్గొన్నారు.

సంజీవయ్యే నిదర్శనం: అశోక్

సోంపేట: జగన్‌రెడ్డి పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. గురువారం మాకన్నపురంలో విలేకరులతో మాట్లాడుతూ బీసీలకు తీరని అన్యాయం చేస్తున్నారని అందుకు ఎంపీ సంజీవయ్యే నిదర్శనమన్నారు. ఆయన లాగే ఇంకా ఎందరో వైసీపీని వీడేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా డబ్బులు పంపిణీ చేస్తున్నానని చెబుతున్నప్పటికీ దానికి భిన్నంగా ప్రజల ఖాతాలు ఖాళీ అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సూరాడ చంద్ర మోహన్, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దిల నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బీసీ ద్రోహి జగన్: ఎల్ఎల్ నాయుడు



టెక్కలి: రాష్ట్రంలో బీసీలద్రోహిగా ముఖ్యమంత్రి జగన్ గుర్తిండిపోతారని, బీసీ సామాజిక వర్గానికి తీరని అన్యాయం చేశారని టీడీపీరాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎల్ఎల్ నాయుడు తెలిపారు. గురువారం టెక్కలిలో విలేకరులతో మాట్లాడుతూ బీసీలకు వైసీపీ సర్కార్ చేసిందేమీ లేదని, మొక్కుబడిగా బీసీలకు సంబంధించి 59 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, నిధులు లేక నిర్జీవంచేశారని ఆరోపించారు. ఒక్క బీసీ వ్యక్తికి కూడా కార్పొరేషన్ల ద్వారా రుణం ఇవ్వలేదని ఆరోపించారు. రాష్ట్రంలో నేడు బీసీలకు రక్షణ కరువైందని, అధికారంలో ఉన్న బీసీ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు మాట్లాడే అధికారం లేకుండాపో యిందని తెలిపారు. వైసీపీలో సజ్జల, పెద్దిరెడ్డి, సుబ్బారెడ్డి, విజయ సాయిరెడ్డి వంటి వారికే ప్రాధాన్యత తప్ప బీసీలకు ఆ పార్టీలో సరైన గౌరవం, సముచిత స్థానం లేదని, ఆ పార్టీలోఉన్న బీసీనాయకులు తలదించుకొని బతుకుతున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని అధికార పార్టీకి చెందిన కర్నూలు ఎంపీ బట్టబయలు చేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వ్యవహారశైలి వల్ల బీసీ యువతకు ఉద్యోగావకాశాలు లేకుండా పోయాయని, ఉన్న పరిశ్రమలు వెళ్లిపోగా కొత్తపెట్టుబడులు ఆకర్షించలేకపోయారని తెలిపారు. వైసీపీలో బీసీలకు భవిష్యత్ లేదని, టీడీపీలో నాడు ఎన్టీఆర్ మొదలుకొని చంద్ర బాబునాయుడు వరకు బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. బీసీలపై వైసీపీ సర్కార్ మొసలి కన్నీరు కారుస్తోందని ఆరోపించారు.

బీసీ నాయకులకు గౌరవం లేదు: సాలిన

ఇచ్ఛాపురం: వైసీపీలో బీసీ నేతలకు, ప్రజలకు ఎటువంటి గౌరవం లేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాలిన డిల్లీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ సంజీవయ్య లాగే చాలామంది బీసీ నేతలు వైసీపీ వీడనున్నారని తెలిపారు. జగన్‌రెడ్డి పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. బీసీ యువతకు సరైన విద్యా ప్రోత్సాహం అందడం లేదని, ఆంధ్రప్రదేశ్‌లో అరాచక పాలన నడుస్తోందని తెలిపారు. రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థలన్నీనిర్వీర్యం చేశారని ఆందోళన వ్యక్తంచేశారు. యువతకు ఉద్యోగ అవకాశాలు, కొత్తపరిశ్రమలు లేవని, ఉన్న పరిశ్రమలు కూడా ఏపీని విడిచి వెళ్లిపోతున్నా యని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధి కన్నా అప్పులు వైపు అడుగులు వేస్తోందని తెలిపారు. వైసీపీలో బీసీలకు రాజకీయ భవిష్యత్ లేదని, పార్టీ కేవలం ఒక సామాజిక వర్గం ఆధీనంలోనేఉందని పేర్కొన్నారు.

వైసీపీలో గుర్తింపు లేని బీసీలు: కళా



ఎచ్చెర్ల: వైసీపీ పాలనలో బీసీ నేతలకు, ప్రజలకు సరైన గుర్తింపు లేదని గురువారం టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావు అన్నారు. వైసీపీతో వేగలేక చాలా మంది బీసీ నేతలు బయటకు వచ్చేస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో బీసీ వర్గాలకు ఒరిగిందేమీలేదన్నారు. సంక్షేమ పథకాల పేరిట ఓ వైపు డబ్బులు అందజేస్తున్నామని చెబుతూ.. మరో వైపు పన్నుల పేరిట, ధరలను పెంచి అంతకు మించి గుంజేస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో యువతకు సరైన ప్రోత్సాహం లేక పరాయి రాష్ట్రాలకు పరుగులు తీస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి చరమగీతం పాడేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

వచ్చేది టీడీపీ-జనసేన ప్రభుత్వమే

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

శ్రీకాకుళం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పాటుతో ప్రజల కష్టాలు తొలగిపోతాయని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రూ.13లక్షల కోట్లు అప్పులు చేసిన జగన్‌రెడ్డి.. ఆ డబ్బుతో రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేశారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. వైసీపీ మునిగిపోతున్న నావలా తయారైందన్నారు. వైసీపీ తప్పిదాలను టీడీపీకి, చంద్రబాబుకు ఆపాదించడం సరికాదన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలనే అమలు చేయమంటున్న చిరు ఉద్యోగులపై కఠిన చర్యలకు పాల్పడడం ఎంతవరకు సమంజసమన్నారు. సైకో సీఎం ప్రవర్తనతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందిపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని కాపాడేందుకు అన్ని విధాలా చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని.. ప్రజలు కూడా బాబు సభలకు సంపూర్ణ మద్దతు పలుకుతున్నారని చెప్పారు. అన్ని వ్యవస్థలను జగన్‌రెడ్డి నాశనం చేశారని.. ప్రభుత్వం మారకుంటే మరింత ఇబ్బందికర పరిస్థితిని రాష్ట్రం చవిచూస్తుందన్నారు. టీడీపీ నిర్వహిస్తున్న 'రా.. కదలిరా' సమావేశాలకు అందుకే తండోపతండాలుగా హాజరై బలంగా చంద్ర బాబుకి మద్దతు ఇస్తున్నారని వెల్లడించారు. సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు, నగర పార్టీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటేసిన పాపానికి నరకం చూపిస్తారా?

● గుంతల రోడ్డుపై టీడీపీ నాయకులు నిరసన


గుంతల రోడ్లపై నిరసన తెలుపుతున్న గొండు శంకర్

శ్రీకాకుళం క్రైం: ఒక్క చాన్సు అంటూ మాయచేయడంతో గత ఎన్నికల్లో ఓటేసిన పాపానికి ప్రజలకు నరకాన్ని చూపించడం దారుణమని టీడీపీ యువ నాయకుడు, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం రూరల్ మండలం రాగోలులో నిర్వహించిన బాబుతోనే భవిష్యత్ గ్యారంటీ.., రా..కదలి రా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం-ఆమదాలవలస రహదారిలో గుంతలను ఆయన పరిశీలించి రాగోలు నుంచి ఆర్టీసీ కాలనీ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం వచ్చిన నాలుగున్నరేళ్లలో ఒక్క రోడ్డు నిర్మాణం పూర్తిస్థాయిలో చేపట్టలేదన్నారు. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వెళ్లే రోడ్డులో రోజూ ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికే కొంతమంది మృత్యువాతపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డులో జరిగిన ప్రమాదంలో చనిపోయిన వారందరి చావుకు ప్రభుత్వం బాధ్యత వహించాలని, వారికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్పీకర్ తమ్మినేని, మంత్రి ధర్మాన తమ స్వంత నియోజకవర్గాల్లోని రోడ్డు దుస్థితి ఇలా ఉన్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీ అధికారంలోకి వచ్చాకే అభివృద్ధి సాధ్యపడుతుందని శంకర్ అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ మూకళ్ల శ్రీను, సర్పంచ్‌లు బైరి నరేష్, రుప్ప లక్ష్మి, రంది అప్పలస్వామి, మాజీ సర్పంచ్ పేడాడ రామారావు, ఎ.చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష సభ్యుల ప్రాదేశికాలపై చిన్నచూపు తగదు

ఇచ్ఛాపురం రూరల్: ప్రతిపక్ష సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాదేశికాలపై చిన్నచూపు తగదని బిర్లంగి ఎంపీటీసీ సభ్యురాలు దక్కత ఏకాంబరీదేవి అధికారులను నిలదీశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. బిర్లంగి పంచాయతీలో సబ్‌సెంటర్‌లో ఉన్న ఏఎన్ఎంను కవిటి మండలం రాజపురం డిప్యూటేషన్‌పై పంపించడం ఏంటని, దీనివల్ల ఇక్కడివారి పరిస్థితి ఏమిటని వైద్యుడు వెచ్చా సంతోష్‌ను నిలదీశారు. ఇచ్ఛాపురం నుంచి ధాన్యాన్ని పలాస, టెక్కలి మిల్లులకు కేటాయిస్తుండడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారని కేశుపురం, కేదారిపురం సర్పంచ్‌లు జి.డిల్లీరావు, ఎన్.సారథి అన్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు కారణంగా పంటలు పూర్తిగా పోయాయని వారికి నష్ట పరిహారం మాటేమిటని ఎంపీపీ బోర పుష్ప, జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ ఏవో భార్గవిని ప్రశ్నించారు. అలాగే అధికారులు వారిశాఖ సమీక్ష అయిపోయిన తర్వాత వెనుదిరగడంతో సమావేశ మందిరం అధికారులు లేక బోసిపోతుంది. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. జడ్పీటీసీ ఉప్పాడ నారాయణం, వైస్ ఎంపీపీలు గురుమూర్తి, వివేకానంద రెడ్డి, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, ఎంఈవో అప్పారావు, సీడీపీవో పి.నాగరాణి, ఏవో భార్గవి తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం: విధి నిర్వాహణలో సేవలే గుర్తింపునిస్తాయని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న కొవ్వూరు అప్పారావు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో అప్పారావును ఎస్పీ సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఏఎస్పీ జె.తిప్పేస్వామి, డీఎస్పీలు వై.శృతి, నాగేశ్వరరెడ్డి, ఆర్ఐ కె.నర్సింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

సోంపేట: స్థానిక జూనియర్ కళాశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భోగి మంటలు వేసి సందడి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.మోహనరావు, ఎన్ఎస్ఎస్ పీవో ఎ.రామినాయుడు, ఎం.ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.


భోగీ మంట వేస్తున్న దృశ్యం

ఓపెన్ జిమ్ ఏర్పాటు

ఇచ్ఛాపురం: పట్టణానికి చెందిన దక్కత సుమన్‌రెడ్డి క్రీడాకారుల కోసం రూ.3లక్షలు వెచ్చించి సురంగిరాజా మైదానంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయిస్తున్నారు. 30 ఏళ్లగా ఆర్మీలో కెప్టెన్‌గా విధులు నిర్వహించిన ఆయన ఇటీవలే ఉద్యోగ విరమణ చేశారు. సొంత ఊరు కోసం ఏదైనా చేయాలనే ఆలోచనతో క్రీడాకారులు, వాకర్స్ కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటుకు ముందుకొచ్చారు. మరో రెండు రోజుల్లో జిమ్ పనులు పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురానున్నట్టు ఆయన తెలిపారు.

1008 పూలతో అమ్మవారికి పూజలు



ఇచ్ఛాపురం: జగన్నాథస్వామి ఆలయంలో వేంచేసివున్న శ్రీమహాలక్ష్మీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. మార్గశిర మాసం ఆఖరి గురువారం అమావాస్యతో కూడుకున్న పర్వదినం సందర్భంగా అభిషేకాలు, అలంకరణ, కుంకుమ సహస్రనామ అర్చనలు జరిపారు. ఈ సందర్భంగా ఐదు రకాలైన 1008 చామంతి పూలతో ప్రత్యేకంగా పూజలు జరిపి అమ్మవారికి అలంకరించారు.

యువజనోత్సవాలకు ఎంపిక

కవిటి: వివేకానంద జయంతిని పురష్కరించుకొని జనవరి 12న మహారాష్ట్రలో జాతీయ యువజన ఉత్సవాలు జరగనున్నాయి. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో జానపద నృత్యం వ్యక్తిగత విభాగంలో కవిటి గ్రామానికి చెందిన కడియాల సాయి నితీష్ ప్రతిభ చూపాడు. రాష్ట్ర స్థాయిలో సత్తాచాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో కవిటికి చెందిన పలువురు అభినందించారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన


ఇచ్ఛాపురంలో చేయిచేయి కలుపుతూ..


ఎచ్చెర్లలో ఉరివేసుకుని వినూత్నంగా..

సమస్యల పరిష్కారం కోరుతూ గత 31 రోజులుగా జిల్లా వ్యాప్తంగా చేపట్టిన అంగన్‌వాడీల నిరసన గురువారం కొనసాగింది. వివిధ రూపాల్లో ఆందోళన చేపట్టారు. పలువురు సంఘీభావం తెలిపారు.

- ఆంధ్రజ్యోతి బృందం


కోటబొమ్మాళి ప్రాజెక్టు కార్యాలయం వద్ద..


ఆమదాలవలస పట్టణంలో..


సారవకోటలో..


టెక్కలి రూరల్: తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో..


కొత్తూరు: డూడూ బసవన్నకు వినతి పత్రం అందిస్తూ..

నేడు క్విజ్ పోటీలు

కంచిలి: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా శుక్రవారం పెద్ద కొజ్జిరియా గ్రామంలో వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర స్థాయి ఓపెన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు గురువారం నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతీ జట్టులో నలుగురు సభ్యులు పాల్గొనవచ్చునని తెలిపారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు వరుసగా రూ.8116, రూ.5116, రూ.3116 నగదుతోపాటు షీల్డ్‌లు ఇవ్వనున్నట్టు తెలిపారు.

ఎంపీ నిధులతో రచ్చబండ నిర్మాణం

ఆమదాలవలస: కొర్లకోట గ్రామంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు నిధులు కేటాయించడంతో రచ్చబండ నిర్మాణం చేపడుతున్నట్టు కొర్లకోట ఎంపీటీసీ అన్నెపు భాస్కరరావు తెలిపారు. గురువారం రచ్చబండ నిర్మాణం చేపట్టనున్న గ్రామంలోని పెద్ద కోనేరు రావిచెట్టు వద్ద మండల ఇంజనీరింగ్ అధికారి జ్యోతి స్థల పరిశీలన చేశారు. కోనేరు రక్షణగోడ రావిచెట్టు వద్ద చర్చబండ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీని కోరగా రూ.4.95 లక్షలు మంజూరు చేసినట్టు భాస్కరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీటీసీతోపాటు సనపల అప్పలనాయుడు, కోడిపాత్రుని మల్లేశ్వరరావు తదితరులు రామ్మోహన్‌నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాలో 17,600 మందికి లబ్ధి

కలెక్టరేట్: జగనన్న తోడు, ఫేజ్-3లో భాగంగా జిల్లాలో 17,600 మంది లబ్ధిదారులకు రూ.1862.18లక్షల లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ శ్రీకేష్ బి.లఠ్కర్ అన్నారు. గురువారం ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో నగదు జమ చేశారు. కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, డీఆర్డీఏ పీడీ విద్యాసాగర్, ఎల్‌డీఎం సూర్యకిరణ్, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, లబ్ధిదారుల పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

శ్రీకాకుళం క్రైం: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజా సంక్షేమం కోసం పాటుపడేది వైసీపీ ప్రభుత్వమని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాద రావు అన్నారు. రూరల్ మండలం కిష్టప్పపేటలో నూతనంగా నిర్మించిన వెల్ఫేర్ సెంటర్, రైతు భరోసా కేంద్రాన్ని, పలు అభివృద్ధి కార్యక్రమాలను గురువారం మంత్రి ప్రారంభించి మాట్లాడారు. అనంతరం పెరిగిన పింఛన్లను మంత్రి పంపిణీ చేశారు. తహసీల్దార్ వెంకటరావు, గ్రామస్థులు గుండ హరీష్, నర్సింగరావు పాల్గొన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి

జి.సిగడాం: ప్రధాన మంత్రి మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ మండల అధ్యక్షుడు, నియోజకవర్గ విశ్వకర్మ కోఆర్డినేటర్ వజ్జపర్తి రఘురాం అన్నారు. గురువారం ఆనందపురం, ఎందువ గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ తమ్మినేని గోవిందరావు, నియోజకవర్గ కోకన్వీనర్ సంపతరావు నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● **బూర్జ:** ఓవీపేటలోని గురువారం కేంద్ర ప్రభుత్వ పథకాలపై వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. క్రేంద ప్రభుత్వం గ్రామీణ ప్రజల అభ్యున్నతికి అనేక పథకాలు ప్రవేశపెట్టిందని వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

నంది అవార్డు గ్రహీతకు సన్మానం

ఇచ్ఛాపురం రూరల్: టి.బరంపురం గ్రామానికి చెందిన జానపద కళాకారుడు తిప్పన ధనుంజయ రెడ్డికి ఇటీవల ప్రభుత్వం నంది అవార్డుతో సత్కరించింది. దీంతో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బోర పుష్ప ఆధ్వర్యంలో సన్మానించారు. జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, ఎంపీడీవో ఎంఈవో ఉన్నారు.